


బంగారపు బొట్లు సమర్పణ

శ్రీకాకుళం(ఘంటసాల): ఆంధ్ర మహావిష్ణువు శ్రీకాకుళేశ్వరస్వామికి తెనాలి పట్టణం చినరావూరుకి చెందిన వి.నిరంజన్‌రావు దంపతులు బంగారపు బొట్లు సమర్పించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 916 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 200 క్యూసెక్కులు వదిలారు.

శాకంబరీదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి



అచ్చంపేట: స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో భక్తులు అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఒలింపిక్స్‌కు ఎస్‌ఆర్‌ఎం విద్యార్థిని

400 మీటర్ల రిలే పరుగు పోటీకి జ్యోతికశ్రీ ఎంపిక



మంగళగిరి: ప్యారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌కు ఎస్‌ఆర్‌ఎం విశ్వ విద్యాలయం విద్యార్థిని దండి జ్యోతికశ్రీ ఎంపికైంది. 400 మీటర్ల రిలే పరుగు పందెంలో సత్తా చాటేందుకు ప్యారిస్ వెళ్లింది. అమరావతిలోని యూనివర్సిటీలో జ్యోతిక శ్రీ ఇటీవలే ఫస్ట్ ఇయర్ బీఏ కోర్సులో ప్రవేశం పొందింది. పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన ఆమె ఇప్పటికే అంతర్జాతీయ అథ్లెట్‌గా గుర్తింపు పొందింది. 2021 ఢిల్లీ కేంద్రంగా జరిగిన ఇండియన్ నేషనల్ క్రీడా పోటీలలో ఉమెన్స్ (అండర్ – 23 కేటగిరి)పరుగు పందెంలో స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. అంతర్జాతీయ క్రీడా పోటీలలో పాల్గొని భారత్ జట్టు తరపున అనేక పతకాలను పొందిన జ్యోతికశ్రీ ఒలింపిక్స్‌లోనూ సత్తాచాటుతుందని యూనివర్సిటీ ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. జ్యోతిక శ్రీని యూనివర్శిటీ ఉపకులపతి ఆచార్య మనోజ్ కుమార్ అరోరా, స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ ధీరజ్ పరాశర్లు అభినందించారు.

ప్రతి సభ్యురాలి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



ముప్పాళ్ల: గ్రామ సమైఖ్యల్లో ఉన్న ప్రతి సభ్యురాలి వివరాలను జాతీయ గ్రామీణ లైవ్లీ వుడ్ మిషన్ సైట్‌లో నమోదు చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలు నాయక్ చెప్పారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామ సమాఖ్యల సభ్యుల(వి.ఓ.ఎ)తో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బాలు నాయక్ మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న ప్రతి సభ్యురాలి బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ కార్డుతో పాటుగా ఆర్థిక పరమైన విషయాలన్నీ సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు. మండలంలో మొత్తం వెయ్యి గ్రూపులకు గాను ఇంకా 296 గ్రూపులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రక్రియను నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీపీఎం శ్రీనివాసరావు, లీగల్ కో-ఆర్డినేటర్ కనకారావు, ఏపీఎం బాలస్వామి, సీసీలు నాగరాజు, ఆయా గ్రామాల వీఓఏలు పాల్గొన్నారు.

ఉద్యాన సహాయకుల జిల్లా కార్యవర్గం ఎన్నిక

నరసరావుపేటరూరల్: ఉమ్మడి గుంటూరు జిల్లా ఉద్యాన సహాయకుల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో నిర్వహించిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా గిద్దల ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా చింత గోపినాథ్ యాదవ్, ప్రధానకార్యదర్శిగా వేము ఏసురత్నం, సంయుక్త కార్యదర్శిగా జంపాల ప్రసాద్, కోశాధికారిగా వినయ్‌కుమార్, ఉమెన్ వెల్ఫేర్ కార్యదర్శిగా కరుణకుమారిని ఎన్నుకున్నారు. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా సంఘం పని చేస్తుందని కార్యవర్గ సభ్యులు తెలిపారు. సంఘం సభ్యులుగా కలగోట్ల రామకోటిరెడ్డి, గాలం యథేంద్ర నాగరాజు, ముప్వా గురునాధం, చింతలపూడి రాజేశ్వరిలు ఉన్నారు.

పరిశ్రమలకు ప్రోత్సాహం

- ఔత్సాహికులు ముందుకు రావాలి
- సింగిల్ డెస్క్ విధానంలో అనుమతులు
- ఎంఎస్‌ఎంఈలకు రూ.8.44 కోట్ల మంజూరుకు ఆమోదం
- డీఐఈపీసీ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, చిత్రంలో హాజరైన వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణం ఉందని, ఔత్సాహికులు ముందుకు రావాలని, మౌలిక వసతులు కల్పిస్తామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో డిస్ట్రిక్ ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ (డీఐఈపీసీ) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ విధానంలో పరిశ్రమలకు అనుమతులు ఇస్తామని వెల్లడించారు. జిల్లా పారిశ్రామికాభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ప్రభుత్వం అందించే రాయితీలపై ఔత్సాహికులకు, అధికారులకు అవగాహన కల్పించాలని సూచించారు. క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. నిరుద్యోగ యువత పీఎంఈజీపీ ద్వారా పరిశ్రమల కోసం దరఖాస్తు చేసుకుంటే ఉత్పత్తి యూనిట్లకు రూ.50 లక్షలు, సేవల యూనిట్‌కు రూ.20 లక్షలు మంజూరు చేస్తారని వివరించారు. అలాగే ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన ద్వారా అందిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఎంఎస్‌ఎంఈలకు సంబంధించిన 165 క్లైయిమ్‌లకు రూ.8 కోట్ల 44 లక్షల మంజూరుకు కలెక్టర్ ఆమోద ముద్ర వేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆర్.వెంకటేశ్వరరావు, పరిశ్రమల డెప్యూటీ డైరెక్టర్ యుగంధర్, సాంఘిక సంక్షేమ శాఖ డెప్యూటీ కలెక్టర్ మధుసూదనరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ జీవన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ ఎం.నారాయణ, డెప్యూటీ లేబర్ కమిషనర్ గాయత్రి దేవి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సుభాని, భూగర్భ జల వనరుల శాఖ డెప్యూటీ డైరెక్టర్ వందనం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి, డీటీసీ కరీం, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆర్.మహిపాల్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రియల్ రీజినల్ ప్రెసిడెంట్ పరిమళ, లీగల్ మెట్రాలజి శాఖ అధికారులు తదతరులు పాల్గొన్నారు.

కార్గిల్ వీరులను స్మరించుకుందాం



జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కార్గిల్ వీరుల త్యాగాలను స్మరించుకోవడం బాధ్యతని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక సైనిక సంక్షేమ కార్యాలయం వద్ద శుక్రవారం కార్గిల్ విజయ దివస్ 25వ వార్షిక కార్యాక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమర జవాన్ల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం చేశారు. అనంతరం కార్గిల్ యుద్ధంలో మరణించిన సైనికుల గౌరవార్థం వారి కుటుంబ సభ్యులకు శాలువాలు కప్పి మెమెంటో అందించి, సత్కరించారు. యుద్ధాల్లో అమరులైన జవాన్ల కుటుంబ సభ్యులతోపాటు విశ్రాంత సైనికులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారిణి గుణశీల, డైరెక్టర్ ఆఫ్ సైనిక్ వెల్ఫేర్ బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ గుర్రం బ్రహ్మయ్య, గుంటూరు తూర్పు మండల తహసీల్దారు నగేష్ పాల్గొన్నారు.

‘వృద్ధ’ండురాలు అంజమ్మ

- ఆమె ఆత్మవిశ్వాసానికి సలాం
- 95 ఏళ్ల వయసులోనూ కాయకష్టం
- ఆదరించే బిడ్డలున్నా ఒంటరి నివాసం
- ఓపిక ఉన్నప్పుడు సొంతంగా జీవించాలనే ఉన్నత సంకల్పం



కడప అంజమ్మ

తెనాలి: స్థానిక నెహ్రూ రోడ్డులో శ్రీ సీతారామ మందిరం.. కొంచెం ఎదురుగా ఒక దుకాణానికి ముందు పండు వృద్ధురాలు.. వయసు తొంభై ఐదేళ్లు. ఎదురుగా తూనిక, బొగ్గులతో నిండిన సంచులు. ఎవరైనా వస్తే బొగ్గులు తూచి ఇస్తోంది.. వారిచ్చిన డబ్బును తీసుకుంటోంది. మాట కలిపాక తెలిసిన విషయాలతో ఆమెకు సలాం చేయాలనిపించింది.

పాతికేళ్లుగా బొగ్గుల విక్రయం

ఆత్మవిశ్వాసానికి ప్రతీక ఆమె. పండు వృద్ధురాలు. బిడ్డలున్నా వారిపై ఆధారపడాలి అనుకోలేదు. కష్టపడి సంపాదిస్తోంది. ఒంటరిగా జీవిస్తోంది. ఆమె పేరు కడప అంజమ్మ. నిజమే.. ఆమె పూర్వీకులు కడప నుంచి వలస వచ్చారట!

తెల్లని వర్చస్సుతో ఉన్న అంజమ్మ దాదాపు పాతికేళ్లుగా బొగ్గులు చిల్లరగా విక్రయిస్తోంది. భర్త పెద్ద సుబ్బారావు ఉన్నపుడు మార్వాడీ గుడి వీధిలో ఇస్త్రీ బండి వేసేవాడు. తను కూడా భర్తకు సహకారంగా ఉండేది. 65 ఏళ్ల వయసులోనే భర్త అనారోగ్యంతో కాలం చేశాడు. నలుగురు పిల్లలు, పెళ్లిళ్లు అయ్యాయి. ఒంట్లో సత్తువ ఉన్నందున ఎవరిపైనా ఆధారపడాలని చూడలేదు. 1997లో అక్కడే కట్టుకున్న ఇంటిలో కింది భాగాన్ని విక్రయించి, పైభాగంలో ఒంటరిగానే నివసిస్తోంది. కొంతకాలం కూరగాయలు అమ్మింది. ఆ తర్వాత నుంచి బొగ్గుల వ్యాపారం కొనసాగిస్తోంది. రోజుకు రూ.100 నుంచి రూ.200 ఆదాయం కళ్లచూస్తోంది. పండగలు పబ్బాలకు ఆలయాల సందర్శన, యాచకులకు దానధర్మం మామూలే! వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తనకు పింఛను మంజూరైంది. ఆ పింఛను డబ్బులకు తోడు ఆర్జిస్తున్న సంపాదనతో భేషుగ్గా జీవిస్తోంది. రోజూ ఉదయం అల్పాహారం సొంతంగానే తయారు చేసుకుంటోంది. దగ్గర్లో ఉంటున్న చిన్న కోడలు రెండుపూటలా భోజనం సమకూరుస్తోంది. పలకరిస్తే కబుర్లు ఎన్నో చెబుతోంది అంజమ్మ. స్వరాజ్య ఉద్యమంలో తెనాలి వచ్చిన గాంధీజీని చూశాననీ మెరిసే కళ్లతో చెప్పిందామె. రోడ్డుపై వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తుపట్టి, ‘నువ్వు సినిమాలు తీస్తావు కదూ!’ అనటంతో ఆ దర్శకుడు షాకయ్యాడు. అంజమ్మ చేసేది నల్లని బొగ్గుల వ్యాపారం అయినా ఆమె ఆదర్శం, సంకల్పం వెన్నెలంత స్వచ్ఛమైనవి కదూ..!

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ప్రతిపాదనలు

గుంటూరు ఎడ్యుకేషన్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ పురస్కారాలతో పాటు ఎస్‌ఎఫ్‌టీడబ్ల్యూ పురస్కారాలకు అర్హులైన ఉపాధ్యాయులు ఆగస్టు 5లోపు ప్రతిపాదనలు పంపాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు సంబంధిత మండల విద్యాశాఖాధికారులకు దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలతో కూడిన సూచనలు, ఉత్తర్వులను ఎంఈవో, డీవైఈవోల నుంచి పొందాలని తెలిపారు.

ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు వేళాయె..

- నేటి నుంచి ఏపీ ఐసెట్–2024 కౌన్సెలింగ్
- ఆగస్టు 1వ తేదీ వరకు వెబ్ కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్
- ఆగస్టు 3 వరకు ధ్రువపత్రాల పరిశీలన
- పూర్తిగా ఆన్‌లైన్‌లోనే పరిశీలన ప్రక్రియ
- ఆగస్టు 4 నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు
- ఆగస్టు 10న కళాశాలల్లో సీట్ల కేటాయింపు



విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం కోసం ఉద్దేశించిన ఏపీ ఐసెట్–2024 కౌన్సెలింగ్‌లో భాగంగా విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ శనివారం ప్రారంభం కానుంది. కౌన్సెలింగ్‌లో భాగంగా ఆగస్టు ఒకటో తేదీ వరకు ఆన్‌లైన్‌లో వెబ్ రిజిస్ట్రేషన్ జరగనుంది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ శనివారం నుంచి ఆగస్టు 3 వరకు జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఏపీ ఐసెట్–2024 కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేసింది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది.

ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపుతో ప్రక్రియ మొదలు

ఏపీ ఐసెట్–2024లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు శనివారం నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు సెట్స్.ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంది. ఇందు కోసం ఏపీ ఐసెట్ హాల్ టికెట్ నంబరు, ర్యాంకు కార్డు వివరాలతో ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి.

- ఓసీ, బీసీ విద్యార్థులు రూ.1,200, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.600 చొప్పున ప్రాసెసింగ్ ఫీజును తిరిగి ఇదే వెబ్‌సైట్‌లో క్రెడిట్ కార్డు, డెబిట్‌కార్డు, నెట్ బ్యాంకింగ్ మార్గాల్లో చెల్లించాలి. ఏపీ ఐసెట్ డీటైల్డ్ నోటిఫికేషన్, యూజర్ మాన్యువల్, కళాశాలల జాబితా, విద్యార్థులకు మార్గదర్శకాలను ఇదే సైట్‌లో పొందుపర్చారు.
- విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో జరగనుంది. రిజిస్ట్రేషన్ అనంతరం శనివారం నుంచి ఇది ప్రారంభం కానుంది. ఇదిలా ఉంటే పీహెచ్, క్యాప్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, ఆంగ్లో ఇండియన్ కేటగిరీలకు చెందిన విద్యార్థుల ధ్రువపత్రాలను విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలలో భౌతికంగా పరిశీలిస్తారు.

ఆగస్టు 7 వరకు వెబ్ ఆప్షన్లు

ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన విద్యార్థులు కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఆగస్టు 4,5,6,7వ తేదీల్లో వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంది. ప్రైవేటు ఇంటర్నెట్ కేంద్రాలతో పాటు ఇంట్లో నుంచే కంప్యూటర్ ద్వారా ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లోనూ ఆప్షన్ల నమోదుకు యాజమాన్యాలు సహాయ, సహకారాలు అందించనున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న ఆప్షన్లను తిరిగి మార్చుకునేందుకు ఆగస్టు 8న తుది అవకాశం ఉండగా, ఆగస్టు 10న సీట్ల కేటాయింపు జరగనుంది. గుంటూరు జిల్లాలో ఏఎన్‌యూతో పాటు ప్రైవేటు ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలు 10 వరకు ఉన్నాయి. ఆయా కళాశాలల సామర్థ్యానికి అనుగుణంగా ఇన్‌టేక్‌లో 60, 120 చొప్పున ఎంబీఏ, ఎంసీఏ సీట్లు ఉన్నాయి.

‘ఇసుకె’త్తిపోతున్నాం

- స్టాక్ పాయింట్ వద్ద కూటమి నేతల హల్‌చల్
- రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నాం
- జేసీ ఎదుట వాహనదారుల మొర



కొల్లిపర మండలంలో ఇసుక స్టాక్ పాయింట్ వద్ద సమస్యలు తెలుసుకుంటున్న జేసీ భార్గవ్ తేజ

కొల్లిపర: ఇసుక స్టాక్ పాయింట్ వద్ద కొంత మంది టీడీపీ, జనసేన నాయకులు హల్‌చల్ చేస్తున్నారని, అధికారులతో పనిలేకుండా ఇష్టం వచ్చిన వారికి టోకెన్ స్లిప్‌లు ఇస్తుండడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, రోజుల తరబడి పడిగాపులు పడాల్సి వస్తోందని వాహనదారులు, ఇసుక కోసం వచ్చిన వారు జేసీ భార్గవ్ తేజకు మొరపెట్టుకున్నారు. శుక్ర వారం కొల్లిపర, మున్నంగితోపాటు తాడేపల్లిలోని ఇసుక స్టాక్ పాయింట్లను జేసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. డిజిటల్ చెల్లింపు విధానం అమలుపై ఆరా తీశారు. వాహనదారులను, ఇసుక కోసం వచ్చిన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక నుంచి ఇసుక సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు అక్కడ ఉన్న అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దారు శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ పూర్ణ శంకరరావు, ఆర్‌ఐ శ్రీనివాసరావు, ఏపీఎం ప్రియదర్శిని పాల్గొన్నారు.

ఎఫ్‌పీ షాపుల పరిశీలన

తెనాలి: అనంతరం జేసీ దుగ్గిరాల మండల పరిధిలోని ఎఫ్‌పీ షాపులను పరిశీలించి పీడీఎస్ రైస్ తూకం ప్రకారం ఇస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. మిడ్ డే మీల్స్‌కు సంబంధించిన సరుకుల పంపిణీపై ఆరా తీశారు. స్టాక్‌కు వివరాలు ఎప్పటికప్పుడు బోర్డులో పొందుపరచాలని సూచించారు. ఆయన వెంట పలు విభాగాల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కార్గిల్ వీరుల గొప్పదనం చాటుదాం

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు

తాడేపల్లిరూరల్: కార్గిల్ వీర జవానుల గాధలను రాబోయే తరాలకు చెప్పాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో శుక్రవారం బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో, ఎన్‌సీసీ 22 ఆంధ్రా బెటాలియన్, 10 ఆంధ్రా బెటాలియన్ల సహకారంతో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రపంచ దేశాల శాంతి కోసం కృషి చేయడం దేశ ప్రజలందరూ గర్వపడాల్సిన విషయమని కొనియాడారు. కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ దేశ రక్షణలో అసువులు బాసిన సైనికుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. అనంతరం కార్గిల్‌లో వీరమరణం పొందిన జవానులకు నివాళులర్పించారు. వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వీసీలు డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్. ప్రసాద్, ఫ్యాకల్టీ డీన్ డాక్టర్ వేమూరి శ్రీకాంత్, ఎన్‌సీసీ ఆఫీసర్లు లెఫ్టినెట్ వి.మౌనిక, లెఫ్టినెంట్ పావని, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు రోహన్ సైదులు, రాష్ట్ర యువమోర్చా అధ్యక్షుడు వంశీ, జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి, ప్రొఫెసర్ సుభాకర్ రాజు పాల్గొన్నారు.

పల్నాడులో ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యం, కందిపప్పు

నరసరావుపేట: బహిరంగ మార్కెట్‌లో పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలను నియంత్రించేందుకు జిల్లాలో ఎనిమిది ప్రదేశాల్లోని 22 ప్రత్యేక కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 3,386 మందికి 3,842 కిలోల కందిపప్పు, 1,077 మందికి 15,694 కిలోల బీపీటీ బియ్యం విక్రయించినట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి ఎస్.పద్మశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం స్టీమ్డ్ ఫైన్ రకం బియ్యం కిలో రూ.55.85 ఉండగా రూ.49లకు, రా రైస్ ముడి రకం బియ్యం కిలో రూ.52.40 ఉండగా రూ.48లకు, దేశవాళీ కందిపప్పు రూ.174 ఉండగా రూ.160లకు అందజేస్తున్నామన్నారు. అవకతవకలపై 91549 59287 నంబరుకు ఫిర్యాదు చేయాలని కోరారు.

బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ నాగలక్ష్మి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, మూడవ అదనపు జిల్లా జడ్జి వి.ఏ.ఎల్ సత్యవతి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ప్రోగాం ఆఫీసర్స్ వారీగా స్కానింగ్ సెంటర్ల చెక్ లిస్టు తయారు చేయాలని, బాల్య వివాహాలు నమోదవుతున్న తుళ్లూరు మండలంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగలక్ష్మీ అధ్యక్షతన శుక్రవారం గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిరోధక చట్టంపై జిల్లా స్థాయి మల్టీ మెంటర్ అప్రాప్రియేట్ అథారిటీ సమావేశం జరిగింది. మూడో అదనపు జిల్లా జడ్జి వి.ఎ.ఎల్ సత్యవతి మాట్లాడుతూ బాల్య వివాహాలపై అవగాహనకు జిల్లా న్యాయ సేవా సంస్థ సహకారాం తీసుకోవాలని తెలిపారు. సీడ్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రోషన్ కుమార్ మాట్లాడుతూ జిల్లా విభజనకు ముందు పల్నాడు, నిజాంపట్నం, ప్రాంతాలలో ఆడపిల్లల నిష్పత్తి తక్కువగా ఉండేదని, విభజనానంతరం కొత్త గుంటూరు జిల్లాలో ఆ పరిస్థితి లేదని తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కె.విజయలక్ష్మి మాట్లాడుతూ కార్యాలయంలో అవసరమైన కంప్యూటర్, మైక్, జూమ్‌లింకు కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ రామారావు, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

మెరుగ్గా యూటీఎస్ మొబైల్ యాప్

రైల్వే గుంటూరు డీఆర్ఎం రామకృష్ణ


కొత్త కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న డీఆర్ఎం రామకృష్ణ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): యూటీఎస్ మొబైల్ యాప్‌ను మెరుగుపరిచి రైలు టికెట్ల కొనుగోలుకు దూర పరిమితిని సడలించామని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఇప్పుడు రైల్వే ప్రాంగణం నుంచి 5 మీటర్లకు మించిన దూరం నుంచీ టికెట్లు కొనొచ్చని వెల్లడించారు. యూటీఎస్ మొబైల్ యాప్ వినియోగం పెరుగుతుందని పేర్కొన్నారు. రైల్వే వాలెట్ ద్వారా రీచార్జ్‌పై 3 శాతం బోనస్ పొందవచ్చని తెలిపారు.

ఆపరేటింగ్, సిగ్నల్ కంట్రోల్‌రూమ్ కార్గిల్ వీరులకు అంకితం

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కొత్తగా ఏర్పాటుచేసిన ఆపరేటింగ్, సిగ్నల్ కంట్రోల్ రూమ్‌లను కార్గిల్ వీరులకు అంకింతం చేస్తున్నామని గుంటూరు రైల్వే డీఆర్ఎం ఎం.రామకృష్ణ చెప్పారు. స్థానిక పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డీఆర్ఎం కార్యాలయ భవనంలో 3వ ఆపరేటింగ్ కంట్రోల్ బోర్డ్, సిగ్నల్ కంట్రోల్ రూమ్‌లను డీఆర్ఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుమాక-నంద్యాల, శావల్యాపురం-న్యూ విభాగాలతో కూడిన ఆపరేటింగ్ విభాగాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం కె.సైమన్, సీనియర్ డీఓఎం దినేష్ కుమార్, సీనియర్ డివిజనల్ సిగ్నల్, టెలికమ్యూనికేటింగ్ ఇంజినీర్ బి.లక్ష్మణ్, సీనియర్ డీఈఎస్ కోఆర్డినేషన్ జె.వి.అనూషా తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతకు జరిమానా

తెనాలిరూరల్: గంజాయి విక్రయించిన కేసులో నిందితుడికి జరిమాన విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం .. కొల్లిపర మండలం అత్తోటకు చెందిన సోగ భాస్కరరావు గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారంతో అతని ఇంటిపై 2019లో అప్పటి కొల్లిపర ఎస్ఐ కడప శ్రీనివాసరెడ్డి ఆకస్మిక దాడులు నిర్వహించి తనిఖీ చేశారు. 400 గ్రాముల గంజాయి లభించింది. దీనిపై కేసు నమోదు చేసి నిందితుని కోర్టులో హాజరుపరిచారు. కేసు శుక్రవారం విచారణకు రావడంతో సాక్ష్యాధారాలను పరిశీలించిన రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ నిందితునికి రూ.ఐదు వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో ఆరునెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ అల్లంశెట్టి పవన్‌కుమార్ వాదనలు వినిపించారు.

డేటా ప్రాసెసింగ్‌పై విస్తృత పరిశోధనలు


సదస్సులో మాట్లాడుతున్న వీసీ ఆచార్య కె.గంగాధరరావు

ఏఎన్‌యూ(గుంటూరు): డేటా ప్రాసెసింగ్‌పై చేస్తున్న పరిశోధనలు మరింత వేగవంతం కావాలని ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆన్‌లాగ్మేషన్ ఆఫ్ నావిగేషన్ ఎర్త్ అబ్జర్వేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీస్ అనే అంశంపై సాంకేతిక సదస్సు ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య గంగాధరరావు మాట్లాడారు. ప్రపంచం మొత్తం డేటా ప్రాసెసింగ్ పై పరిశోధనలు చేస్తున్నాయని భారత దేశం టెక్స్‌టైల్, మ్యానుఫ్యాక్చరింగ్, ఎన్విపీ, జీపీయూ ప్రాసెసర్, మ్యానుఫ్యాక్చరింగ్ మీద దృష్టి సారించిందన్నారు. గణిత శాస్త్ర నైపుణ్యం అందరూ పెంచుకోవాలని సూచించారు. సెమినార్ డైరెక్టర్ ఆచార్య పి.సిద్ధయ్య మాట్లాడుతూ సాంకేతికతలను మెరుగుపరిచి సమ్మేళనం చేయడం ద్వారా ఒక ఆచరణార్థమైన వ్యవస్థ సామర్థ్యం పెరుగుతుందన్నారు. విశిష్ట అతిథి బి.ఈ.ఎల్ జనరల్ మేనేజర్ డాక్టర్ సిహెచ్ విశ్వనాథన్ మాట్లాడుతూ పరిశ్రమలు ఆశిస్తున్న నైపుణ్యం విద్యార్థులు పొందాలంటే హార్డ్వర్ టెక్నాలజీలో వస్తున్న మార్పులపై దృష్టి సారించాలన్నారు. విఎస్ఎల్ఐ కోర్ టెక్నాలజీపై సాధన చేసి మెలకువలు పెంచుకోవాలని సూచించారు. బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కోసం బీఈఎల్‌లో అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. మరొక విశిష్ట అతిథి ఎఫ్యాట్రానిక్ అధిపతి డి.రామకష్ణ మాట్లాడుతూ డిజిటల్ అల్గారిదం డెవలప్మెంట్, గణిత శాస్త్ర ప్రావీణ్యం భవిష్యత్తును అంచనా వేయగల స్మార్ట్ సిస్టమ్స్ మీద అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎఫెక్ట్రానిక్స్ కంపెనీలు ఇంటర్న్‌షిప్ కల్పిస్తామని సూచించారు . గౌరవ అతిథి, ఇంజినీరింగ్ డీన్ ప్రొఫెసర్ ఇ. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వివిధ దేశాల శాటిలైట్ సిస్టం, రిసెప్షన్ డేటా ఎనాలిసిస్ చేసే సాంకేతికతలను పుస్తక పఠనం మీద మాత్రమే ఆధారపడకుండా పోటీపడి నేర్చుకోవాలన్నారు. మరో గౌరవ అతిథి పి.రాఘవేంద్రరావు అడ్వాన్స్‌డ్ నావిగేషన్ గైడ్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్ ఫర్ మిస్సయిల్స్ స్పెక్ట్రమ్ అనే అంశంపై ప్రసంగించారు. సదస్సుకు వివిధ కళాశాల నుంచి 300 మంది హాజరయ్యారు. గౌరవ అతిథులుగా ఇన్చార్జి రెక్టర్ ఆచార్య రత్న షీలా మణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఓ ఎస్ డి ప్రొఫెసర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాంబిరెడ్డిని పరామర్శించిన అంబటి మురళీకృష్ణ



గుంటూరు ఈస్ట్ టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడి గుంటూరులోని సాయిభాస్కర్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డిని శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. అయనకు ధైర్యం చెప్పారు. వైద్యులను మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

తెనాలి చేరిన రవితేజ మృతదేహం

ఈనెల 18న అమెరికాలో మృతి


తెనాలి ఐతానగర్ ఇంట్లో ఉంచిన రవితేజ మృతదేహం

తెనాలిరూరల్: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి అక్కడ ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడి మృతి చెందిన గుంటూరు జిల్లా తెనాలి ఐతానగర్‌కు చెందిన తాడిబోయిన రవితేజ భౌతికకాయం శుక్రవారం సాయంత్రం తెనాలి చేరుకుంది. అమెరికా నుంచి శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్ చేరుకున్న రవితేజ భౌతికకాయాన్ని అంబులెన్స్ ద్వారా తెనాలి తీసుకు వచ్చారు. ఈ నెల 18న అమెరికాలోని టెక్సాస్‌లో ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడి రవితేజ మృతి చెందిన విజయం తెలిసిందే. రవితేజ తండ్రి గతంలోనే మృతి చెందగా తల్లి జయలక్ష్మి కొడుకుకు మంచి చదువు చెప్పించి పెంచి పెద్ద చేసింది. ఓవైపు చదువుకుంటూనే కోకోకోలా కంపెనీలో ఉద్యోగం చేస్తూ డబ్బులు కూడపెట్టుకున్న రవితేజ ఎంఎస్ కోసం గత ఏడాది ఆగస్టులో అమెరికా వెళ్లాడు. అక్కడ టెక్సాస్‌లో ట్రిన్ యూనివర్శిటీలో ఎంఎస్ చేస్తూ పార్ట్‌టైం జాబ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 18న స్నేహితులతో కలిసి అక్కడ స్విమ్మింగ్‌పూల్‌లో దిగి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దాదాపు ఎనిమిది రోజుల అనంతరం శుక్రవారం సాయంత్రం రవితేజ భౌతికకాయం తెనాలి చేరుకుంది. తెనాలిలో భారీ ఊరేగింపుగా రవితేజ భౌతికకాయాన్ని ఐతానగర్‌లోని నివాసానికి తీసుకువెళ్లారు. రజక చెరువు సెంటర్ నుంచి లింగారావు సెంటర్ మీదుగా రవితేజ నివాసానికి రాత్రికి భౌతికకాయం చేరుకుంది. రవితేజ భౌతిక భౌతికకాయాన్ని చూసి తల్లి జయలక్ష్మి, సోదరుడు కన్నీటి పర్యంతమయ్యారు. పేద కుటుంబానికి చెందిన తాము కొడుకు ప్రయోజకుడవుతాడని అమెరికా పంపిస్తే అనుకోని ప్రమాదంలో అతడు మృతి చెందాడంటూ కొడుకు మృతదేహాన్ని చూసి తల్లి జయలక్ష్మి గుండెల విసేలా రోదించారు. శనివారం ఉదయం రవితేజ భౌతికకాయానికి అంత్యక్రియలు జరగనున్నాయి.

గిడ్డంగుల్లో విజిలెన్స్ తనిఖీలు

రూ.3.36 లక్షల విలువైన 100 లీటర్ల పురుగు మందుల విక్రయాలు నిలిపివేత


స్టాక్ వద్ద విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు నగరంలోని పురుగు మందుల గిడ్డంగుల్లో శుక్రవారం గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గుంటూరు విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు సూర్యదేవరపేట, ఏటుకూరురోడ్డులోని పురుగు మందుల గిడ్డంగుల్లో విస్తృత తనిఖీలు కొనసాగాయి. ఏటుకూరురోడ్డులోని ఓ గిడ్డంగిలో జీఎస్‌పీ ఆగ్రోసైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన 'కూల్ స్టార్' అనే పురుగు మందుల వివరాలను స్టాక్ బోర్డులో, స్టాక్ రిజిస్టర్‌లో సక్రమంగా నమోదు చేయలేదు. ఈ మేరకు నిబంధనలు ఉల్లంఘించడంతో రూ.3.36 లక్షల విలువ చేసే 100 లీటర్ల పురుగు మందుల విక్రయాలను నిలుపుదల చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ వ్యవసాయ అధికారి (ఏఓ) ఓ.రమణకుమార్, స్థానిక వ్యవసాయ అధికారి బి.గౌతం ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగాన్ని పరిరక్షించాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): విద్యారంగాన్ని పరిరక్షించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ డిమాండ్ చేశారు. స్థానిక బ్రాడిపేటలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించతలపెట్టిన జిల్లా ప్లీనరీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు శుక్రవారం అశోక్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్ల విధానాన్ని రద్దు చేయాలని కోరారు. 100 శాతం సీట్లు కన్వీనర్ కోటాలోనే భర్తీ చేయాలని, ఆరు నెలలుగా బకాయిలు ఉన్న మెస్ చార్జీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన నిధులు విడుదల చేయాలన్నారు. కోడిగుడ్ల సత్రం హాస్టల్‌ను ప్రారంభించాలని, కార్పొరేట్ స్కూల్స్, కాలేజీలలో అధిక ఫీజులను, పుస్తక అమ్మకాలను నియంత్రించాలి కోరారు. హాస్టళ్ల భవనాలను ఆధునికీకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మెడికల్ రిప్స్ అధ్యక్షులు కుమార్, జిల్లా కన్వీనర్ సుచరిత, జిల్లా ఉపాధ్యక్షులు నవిత, పవన్ కుమార్, జిల్లా సహాయక కార్యదర్శి సుభాష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు యశ్వంత్,భగత్ సింగ్, భరత్ చందు, ఆరిఫా తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షల్లేకుండా నిరుద్యోగ భృతి ఇవ్వాలి

ఏఐవైఎఫ్ జిల్లా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రబాబు డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి రూ.3వేలు ఎటువంటి ఆంక్షలు లేకుండా ఇవ్వాలని, వయోపరిమితి 35 ఏళ్ల నుంచి 45 ఏళ్లకు పెంచాలని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో శుక్రవారం అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజేంద్రబాబు మాట్లాడుతూ డీఎస్సీని పాత పద్ధతిలోనే ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ వలి, జిల్లా కార్యవర్గ సభ్యులు చల్లా మరిదాసు, జాలాది, నవీన్ బిల్లా, రాజేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్‌జి, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్ నియోజవర్గ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అడవులను క్రయ, విక్రయాలు చేస్తే ఉపేక్షించేది లేదు

జిల్లా అటవీ శాఖ అధికారిణి నీలిమాదేవి


మొక్కలను నాటుతున్న జిల్లా అటవీ శాఖ అధికారిణి నీలిమాదేవి

పిడుగురాళ్ల: అడవులను క్రమ, విక్రయాలు చేస్తే ఉపేక్షించేది లేదని జిల్లా అటవీ శాఖ అధికారి నీలిమాదేవి అన్నారు. పట్టణంలోని ఫారెస్ట్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి అనంతరం మండలంలోని గుత్తికొండ అటవీ భూములను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అడవులను విక్రయించాలని, బాగు చేసుకొని క్రయ, విక్రయాలు చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు. బిలం మరికొన్ని ప్రాంతాలను దర్శించి మొక్కలు నాటారు. కొత్తగా ఎక్కడా అక్రమాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఈ విషయం అందిరికీ తెలిసేలా ప్రతి ఒక్కరూ తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ బీట్ ఆఫీసర్ శ్యాంకుమార్, మనోజ్‌కుమార్, స్ట్రైకింగ్ ఫోర్స్‌తోపాటు పల్నాడు జిల్లా అడవుల పరిరక్షణ కమిటీ సభ్యులు కె.కుమార్, డి.అబ్రహం, ఎం.నాగరాజు, జాషువా, సీహెచ్ ఆంజనేయులు, టి.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2000, గరిష్ట ధర రూ.4000, మోడల్ ధర రూ.3000 వరకు పలికింది.

29,453 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 26,896 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 29,453 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 15,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,210 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించిన ఆర్జేడీ

చీరాల అర్బన్: పట్టణంలోని పలు ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్ని పాఠశాల విద్య ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి శుక్రవారం పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆయన ఈపూరుపాలెంలోని ఏపీ మోడల్ స్కూల్, చీరాలలోని జేమ్స్ హైస్కూల్, ఎన్ఆర్‌పీఎం హైస్కూల్‌ను తనిఖీ చేశారు. తరగతి గదులు, విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ప్రతిభా సామర్థ్యాల్ని తెలుసుకున్నారు. అనంతరం బోధనా నైపుణ్యాలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈవో పి.సుబ్రమణ్యేశ్వరరావు ఉన్నారు.

ఎన్‌సీసీ కార్యకలాపాలు నిలుపుదల

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో కలకలం సృష్టించిన ఎన్‌సీసీ క్యాడెట్స్ ర్యాగింగ్ ఘటనపై ఎన్‌సీసీ డైరెక్టరేట్ తీవ్రంగా స్పందించింది. ర్యాగింగ్ ఘటన చోటుచేసుకున్న శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో 45 రోజుల పాటు ఎన్‌సీసీ కార్యకలాపాలను సస్పెండ్ చేస్తూ ఎన్‌సీసీ డైరెక్టరేట్ నుంచి కళాశాలకు ఉత్తర్వులు జారీ అయినట్టు సమాచారం. ర్యాగింగ్‌కు పాల్పడ్డ ఎన్‌సీసీ క్యాడెట్స్, అలాగే కళాశాల ఎన్‌సీసీ అధికారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో 45 రోజుల లోపు తమకు తెలియచేయాలని కోరినట్టు తెలిసింది. అప్పటి వరకు కళాశాలలో ఎన్‌సీసీ కార్యకలాపాలు జరగరాదని ఆదేశాలు కళాశాలకు అందినట్టు సమాచారం.

ముఖ మండప నిర్మాణం పరిశీలన



అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్య క్షేత్రం శింగరకొండ దేవస్థాన రాతి ముఖ మండప నిర్మాణాన్ని శుక్రవారం విజిలెన్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ టీటీడీ ట్రస్ట్ ద్వారా అందించిన నిధుల సద్వినియోగం, నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు, కొలతలను పరిశీలించామన్నారు. అనంతరం రికార్డులు, ఫైళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎంఆర్వో వి.ఎస్.పాల్, డీవీ శేషయ్య, ఏవీ చిరంజీవి, ఏఈ దివ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచాలి

మార్టూరు: ప్రకృతి సేద్యంపై రైతులతో పాటు ఉత్పత్తులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా అడిషనల్ డీపీఎం మోహన్ తెలిపారు. స్థానిక మండల సమాఖ్య భవనంలో శుక్రవారం డ్వాక్రా గ్రూపులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయాన్ని మహిళా సంఘాలు, గ్రూపుల ద్వారా బలోపేతం చేయాలని చెప్పారు. దిగుబడి అయ్యే వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం, ఏ విధంగా ఆరోగ్యకరమో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు తొలుత విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన, లాభసాటి ఉత్పత్తుల వల్ల కలిగే ప్రయోజనాల్ని తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం రాజారత్నం, చెన్నయ్య, కోటమ్మ ఎంటీఎస్ నీలం ప్రకాష్ కుమార్, శంకర్, రహీమున్, నాగరాజు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం పెరగాలి

ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర కార్యాలయం అధికారి గోపి



కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలో ఈ ఏడాది ప్రకృతి సేద్యాన్ని పెంచే దిశగా విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర కార్యాలయం అధికారి గోపి సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రకృతి సేద్యం విశిష్టతను వివరించారు. రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం గుంటూరు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ బి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని తెలిపారు. సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ ప్రకృతి సేద్యం గురించి సూచనలు, సలహాలను ఇవ్వాలని చెప్పారు. సమావేశంలో ప్రకృతి వ్యవసాయం అధికారి సత్యనారాయణ, ఎన్ఎఫ్ఏలు, క్షేత్ర స్థాయి ఎంటీలు, యూనిట్ ఇన్‌చార్జిలు, మోడల్ మేకర్లు, డిజిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం



నెహ్రూ నగర్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసిన కార్యక్రమాల శిలాఫలకాలను ధ్వంసం చేయడం పరిపాటిగా మారిపోయింది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 45వ డివిజన్ ముత్యాల రెడ్డి నగర్ 8వ లైనులో సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం ధ్వంసం చేశారు.

కోనంకిలో అర్ధరాత్రి అగ్ని ప్రమాదం


అగ్ని ప్రమాదాన్ని పరిశీలిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

మార్టూరు: అగ్ని ప్రమాదంలో మూడు బైకులు, సోడా బండి దగ్ధం కాగా అదే పరిసరాల్లో మరో స్కూటీ, సెల్ ఫోన్ చోరీకి గురయ్యాయి. ఈ ఘటనలు గురువారం అర్ధరాత్రి మండలంలోని కోనంగిలో జరిగాయి. సీఐ ఎస్వీ రాజశేఖర్ రెడ్డి వివరాల మేరకు.. కోనంకి గ్రామానికి చెందిన షేక్ ఖాజావలి వేసవిలో స్థానికంగా సోడాలు విక్రయిస్తూ సీజన్‌లో కర్ణాటకలో వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఇటీవల అక్కడకు వెళ్తూ బైకుతోపాటు సోడా బండిని ఇంటి వరండాలో ఉంచి వెళ్లాడు. అక్కడే ఇరుగుపొరుగు వారు రెండు బైకుల్ని కూడా గురువారం రాత్రి అక్కడే నిలిపారు. ఈ క్రమంలో అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో ఖాజావలి ఇంటి నుంచి వస్తున్న మంటల్ని గమనించిన స్థానికులు అతడి పెద్ద కుమారుడు మస్తాన్‌వలికి సమాచారం అందించారు. అతడు, స్థానికులు కలసి మంటల్ని అదుపులోకి తెచ్చారు. అప్పటికే వరండాలో ఉన్న మూడు బైకులు పూర్తిగా దగ్ధం కాగా, సోడా బండి పాక్షికంగా కాలిపోయింది. విద్యుత్ మీటరు కాలిపోయింది. తర్వాత కిటికీ నుంచి ఇంటి లోపలికి మంటలు వ్యాపించి బీరువాతోపాటు దుస్తులు కాలిపోయా యి.

స్కూటీ దొంగిలించి బైక్‌లను దగ్ధం చేశారా..?

ఖాజావలి ఇంటి సమీపంలో తమ్ముడి కుమారుడు ఇంటి ముందు పార్క్ చేసిన స్కూటీతోపాటు సెల్ ఫోన్ సైతం అపహరణకు గురైనట్లు ఆలస్యంగా గుర్తించారు. వీటిని చోరీ చేసిన అగంతకులే పార్కు చేసి ఉన్న బైకుల్ని దగ్ధం చేసి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. శుక్రవారం ఉదయం బాపట్ల నుంచి వచ్చిన క్లూస్ టీం బృందం ఆధారాల్ని సేకరించింది. సీఐ ఘటనా స్థలికి వెళ్లి అగ్ని ప్రమాదం తీరును పరిశీలించారు. మస్తాన్‌వలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.